# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 368 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 26-2-2025 | వెల : .రూ. 5.00




## మార్చి 1 నుంచే కొత్త రేషన్‌కార్డులు

- ఎన్నోఏళ్ల కల నెరవేరబోతున్న వేళ..
- లక్ష కార్డులు పంపిణీ చేయనున్న అధికారులు

హైదరాబాద్,(నీలగిరి ఎక్స్ ప్రెస్):

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్తను అందించింది. గత పదేళ్లకు పైగా అన్ని అర్హతలు ఉన్న తెల్లరేషన్‌కార్డు లేకపోవడంతో అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు మార్చి -మిగతా 2 లో

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడితే రాజీనామా చేస్తారా

ఈ ఎన్నికలను రెఫరెండంగా తీసుకుంటారా

సీఎం రేవంత్ కు ఎంపి రఘునందన్ రావు సవాల్



సిద్దిపేట,

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే రాజీనామాకు రేవంత్ రెడ్డి సిద్ధమా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సవాల్ విసిరారు. పనిచేశా.. ఓటు వేయమంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను తన పాలనకు రెఫరెండంగా తీసుకుంటారా -మిగతా 2 లో



## ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా తెలంగాణ

### లైఫ్ సైన్సెస్ రంగంలో గణనీయమైన ప్రగతి

- హెల్త్ కేర్ రంగంలోనూ ఎంతో ముందున్నం
- ఫ్యూచర్ సిటీ , ఏఐ సిటితో పాటు ఎన్నో భారీ ప్రాజెక్టులు
- దేశంలో ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించే రాష్ట్రంగా తెలంగాణ
- బయో ఏషియా సదస్సుతలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, (నీలగిరి ఎక్స్ ప్రెస్):

ప్రతి ఏటా నిర్వహించే బయో ఏషియా సదస్సు హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హెల్త్ కేర్ -మిగతా 2 లో




## 27 న పట్టభద్ర, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు

పోటాపోటీ నేతల రాకతో ముగిసిన ప్రచారం

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్,

కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టబద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ప్రచారం ముగిసింది. ఈనెల 27 న టీచర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. గత 15 రోజులుగా ప్రచారాన్ని హోరెత్తించారు అభ్యర్థులు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలకు దూరంగా ఉంది. పట్టభద్రుల స్థానంలో బీజేపీ, -మిగతా 2 లో



## హైదరాబాద్‌లో మోగుతున్న డేంజర్ బెల్స్

-గాలిలో తగ్గుతున్న నాణ్యత ప్రమాణాలు

-24న ఏకంగా 431 ఏక్యూఐ నమోదు

-సనత్‌నగర్‌లో పరిస్థితులు మరీ దారుణం

హైదరాబాద్,(నీలగిరి ఎక్స్ ప్రెస్):

హైదరాబాద్ డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యంతో.. పరిస్థితి ఆందోళనకరంగా మారగా.. ఇప్పుడు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోనూ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా.. సనత్‌నగర్‌లో పరిస్థితులు మరీ దారుణంగా మారాయి. సనత్‌నగర్‌లోని -మిగతా 2 లో



## గల్లంతైన వారి రక్షణకు చర్యలు

- ప్రమాదవశాత్తు ఘటనలపై విమర్శలు తగవు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

నల్లగొండ,

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం చోటు చేసుకుని మూడు రోజులు గడుస్తుంది. టన్నెల్‌లో గల్లంతైన ఎనిమిది మంది ఆచూకీపై ఇంకా స్పష్టత లేదు. రెస్క్యూ టీమ్స్ పలుమార్లు టన్నెల్‌లోకి వెళ్లి ముందుకు వెళ్లే పరిస్థితి -మిగతా 2 లో



## మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదు

- ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలమాట ఏమైంది..?
- చెప్పుకోవటానికి ఒక్కటైనా ఉందా..?
- మతం పేరు లేకుండా బండి ఒక్కమాట మాట్లాడలేదు : సీతక్క

హైదరాబాద్,(నీలగిరి ఎక్స్ ప్రెస్):

మత రాజకీయాలు తప్ప బీజేపీకీ ఏమీ చేతకాదని మంత్రి సీతక్క అన్నారు. బీజేపీ టీం ఇండియా, కాంగ్రెస్ పాకిస్తాన్ అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఒకటి కూడా బీజేపీ కేంద్ర ప్రభుత్వం -మిగతా 2 లో

## బీఆర్ఎస్ లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు

- ఎన్ని కుట్రలు చేసినా జనం గుండెల్లో నిలిచేది బీఆర్ఎస్సే
- హామీల పేరుతో గద్దెనెక్కి.. మాటమార్చిన రేవంత్
- కాంగ్రెస్ అంటేనే కరువు మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్,(నీలగిరి ఎక్స్ ప్రెస్):

రాష్ట్రంలో బీఆర్ఎస్ లేకుండా బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి కుట్రలు పన్నుతున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కానీ వారు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల గుండెల్లో నిలిచేది బీఆర్ఎస్సే అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన మాజీ జడ్పిటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల వివాహాలకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. రూ. 15 వేలు రైతు భరోసా, రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తా అని మాయమాటలు చెప్పారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి 450 రోజులు అవుతుందని.. -మిగతా 2 లో



# ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా తెలంగాణ

(మొదటి తరువాయి)

రంగం భవిష్యత్‌ నిర్దేశించటంతోపాటు ప్రపంచానికే మార్గదర్శనం చేసేలా బయో ఏషియా దేశ విదేశాలను ఆకర్షిస్తోందని చెప్పారు. దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన ఫార్మా, హెల్త్‌ కేర్‌, లైఫ్‌ సైన్స్‌, బయోటెక్‌ కంపెనీలు ఎన్నో హైదరాబాద్‌ నుంచి పనిచేస్తున్నాయని సీఎం చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బయో ఏషియా–2025 కార్యక్రమంలో సీఎం రేవంత్‌ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ రెడ్డి మాట్లాడుతూ..'రాబోయే 10 సంవత్సరాలలో తెలంగాణను ఒక ట్రిలియన్‌ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకే పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను అందించే సంస్థలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్‌ ప్రభుత్వం పని చేస్తోంది. మేము ఇంతకాలం ఉన్నత విద్యపై పెట్టుబడులు పెట్టాం. ఎందరో శాస్త్రవేత్తలు, శాస్త్ర, సాంకేతిక నిపుణులు, ఇంజినీర్ల సమూహాన్ని తయారు చేశాం. జీనోమ్‌ వ్యాలీని కూడా ఏర్పాటు చేసుకున్నాం. హైదరాబాద్‌ కోర్‌ అర్బన్‌ సిటీ ఏరియా సేవల రంగానికి ప్రాధాన్యమిస్తాం. హైదరాబాద్‌ లో ఫ్యూచర్‌ సిటీ, ఏఐ సిటీతోపాటు ఎన్నో భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాం. దేశంలో ఇప్పుడు హైదరాబాద్‌ ఎలక్ట్రిక్‌ వాహనాల రాజధానిగా అవతరించింది. దేశంలోనే అత్యధిక ఎలక్ట్రిక్‌ వాహనాల అమ్మకాలు ఇక్కడే జరుగుతున్నాయి. 3,000 ఎలక్ట్రిక్‌ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెడుతున్నాం. కోర్‌ సిటీ వెలుపల ఔటర్‌ రింగ్‌ రోడ్డు నుంచి రీజనల్‌ రింగ్‌ రోడ్డు వరకూ మాన్యుఫ్యాక్చరింగ్‌ హబ్‌ను అభివృద్ధి చేస్తాం. ప్రపంచంలోని అతిపెద్ద తయారీ కేంద్రాలలో ఒకటిగా దీన్ని నెలకొల్పుతాం. ప్రపంచం నలుమూలాల నుంచీ పెట్టుబడులను ఆహ్వానిస్తాం. ఓఆర్‌ఆర్‌.. ఆర్‌ఆర్‌ఆర్‌.. ఈ రెండు రింగ్‌లను రేడియల్‌ రోడ్లతో అనుసంధానిస్తాం. ఈ రహదారులకు ఇరువైపులా క్లస్టర్లను అభివృద్ధి చేస్తాం. తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి ఏపీలోని సీ పోర్టుకు అనుసంధానించేందుకు ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు మెరుగుపరుస్తాం. బయోసైన్సెస్‌, బయోటెక్‌, లైఫ్‌ సైన్సెస్‌ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి, తయారీ, నైపుణ్యాల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో పని చేస్తున్నాం. నిన్ననే హైదరాబాద్‌లో ఆమ్జెన్‌ సంస్థ తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది మా సహకారానికి నిదర్శనం. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, మా ప్రభుత్వ సహకారాన్ని అందుకోవాలని, మాతో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలు అన్నింటినీ ఆహ్వానిస్తున్నాం. సులభమైన పారిశ్రామిక విధానం, మౌలిక సదుపాయాలు, ఆశించినంత మద్దతు అందించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌ వన్‌ స్థానంలో ఉంది. ఇక్కడ అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. ఇటీవల దావోస్‌ ప్రపంచ ఆర్థిక వేదికలోనూ తెలంగాణ రూ. 1.8 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. విభిన్న రంగాలలో దాదాపు 50,000 ఉద్యోగాలు రానున్నాయి. గతేడాది లైఫ్‌ సైన్సెస్‌ రంగంలోనూ రూ. 40 వేల కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించాం. దాదాపు 150పైగా ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులు విస్తరించాయి. ఓఆర్‌ఆర్‌, ఆర్‌ఆర్‌ఆర్‌ మధ్య ఫార్మా గ్రామాలు అభివృద్ధి చేస్తున్నాం. ఐదు లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలని ఆశిస్తున్నాం. ఫ్యూచర్‌ సిటీ ప్రాజెక్ట్‌ కింద కీలకమైన గ్రీన్‌ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అతిపెద్ద ఫార్మాస్యూటికల్‌ కంపెనీలు అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయి. జర్మన్‌ కంపెనీ మి÷–టలెని బయోటెక్‌ జీనోమ్‌ వ్యాలీలో తన సెల్‌, జన్యు చికిత్సను ప్రారంభించింది. ఈ వేదిక పైనుంచి మరో నాలుగు బహుళజాతి కంపెనీలను మా పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నాం. 25 సంవత్సరాల్లో ఫార్మా తయారీ, ఐటీ, డిజిటల్‌ హెల్త్‌ పవర్‌ హౌస్‌గా హైదరాబాద్‌ పేరు నిలుపుకుంది. గతేడాది ఏఐ హెల్త్‌కేర్‌ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించాం. దేశవిదేశాల నుంచి బయో ఏషియా సదస్సుకు హాజరైన ప్రముఖుల గొప్ప మనస్సుకు అభినందనలు. మీరందరూ తెలంగాణను అనువైన వేదికగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నా. జీనోమ్‌ వ్యాలీ ఎక్సలెన్స్‌ అవార్డ్‌ పొందిన ప్రొఫెసర్‌ పాట్రిక్‌ టాన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని' చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్‌ రంజన్‌ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడితే రాజీనామా చేస్తారా

(మొదటి తరువాయి)

అని ప్రశ్నించారు. మంగళవారం రఘునందన్‌ రావు మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికలతో తమ ప్రభుత్వానికి వచ్చేది లేదు.. పోయేది లేదు అంటున్న కాంగ్రెస్‌ నేతలు ఎందుకు పోటీ చేస్తున్నారని నిలదీశారు. కార్‌ రేస్‌ కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఏసీబీ రేవంత్‌ ప్రభుత్వం కంట్రోల్‌లో పని చేసేదే కదా అరెస్ట్‌ ఎందుకు చేయించడం లేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ పొత్తు అంటున్న సీఎం రేవంత్‌ రెడ్డి ఒక్క ఆధారమైనా చూపించాలని ఛాలెంజ్‌ చేశారు. పాత సీఎస్‌ సోమేష్‌ కుమార్‌ వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని చెప్పిన వాళ్లు.. ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రింగురోడ్డు టోల్‌ గేట్‌ కుంభకోణంలో రేవంత్‌ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని రఘునందన్‌ రావు ప్రశ్నించారు. అంతకుముందు సిద్దిపేట కొండా భూదేవి గార్డెన్‌లో కరీంనగర్‌, నిజామాబాద్‌, మెదక్‌, అదిలాబాద్‌ పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్‌ రావు మాట్లాడుతూ... బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలుపును ఎవరూ ఆపలేరని జోస్యం చెప్పారు. ఇద్దరు బీజేపీ అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుస్తారని మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు ధీమా వ్యక్తం చేశారు. మిగతా పార్లమెంట్‌లలో కంటే మెదక్‌ పార్లమెంట్‌ పరిధిలో ఎక్కువ ఓట్లు సాధిస్తామని అన్నారు. గతంలో గెలిచిన నాయకులు కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ పంచన చేరారు, కానీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని మండిపడ్డారు. ఇతర పార్టీలో నాయకులను కొన్నట్లుగా బీజేపీ పార్టీ నాయకులను కొనలేరని మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు స్పష్టం చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుందని మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు ఉద్ఘాటించారు. బీసీలలో ముస్లింలను రేవంత్‌ రెడ్డి కలిపారని ఆరోపించారు. నూటికి 55శాతం బీసీలు ఉంటే వారికి ఉన్న వాటా ప్రకారం మంత్రి పదవులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ ఎప్పుడు కూడా బీసీని ఎందుకు సీఎం చేయలేదని మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు నిలదీశారు. కేంద్రమంత్రి పదవుల్లో బీసీలకు మోదీ పెద్దపీట వేశారని చెప్పారు. ఒక్క మైనార్టీకి కూడా కాంగ్రెస్‌ మంత్రి పదవి ఇవ్వలేదని అన్నారు. తనకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదని చెప్పారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ముందుగా ధామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు నిర్ణయించాలని రఘునందన్‌ రావు డిమాండ్‌ చేశారు.

# బీఆర్‌ఎస్‌ లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్‌ కుట్రలు

(మొదటి తరువాయి)

రోజుకు ఒకరి చొప్పున 450 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్‌ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. భారతదేశంలో రైతు ఆత్మహత్యలు అత్యధికంగా తగ్గించింది కేసీఆర్‌ ప్రభుత్వం అని కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందని గుర్తు చేశారు. మరి కాలం తెచ్చిన కరువా..? కాంగ్రెస్‌ తెచ్చిన కరువా..? అర్థం చేసుకోవాలన్నారు. కేసీఆర్‌ మీద కోపంతోనే మేడిగడ్డ రిపేర్‌ చేయడం లేదని ఆరోపించారు. శివుడు గంగను కిందకు తీసుకువస్తే.. కేసీఆర్‌ గంగను పైకి తెచ్చిండని పేర్కొన్నారు. కానీ రైతులకు మాయమాటలు చెప్పి ఓట్లు కొల్లగొట్టారు అని కేటీఆర్‌ తెలిపారు. కాళేశ్వరంలో ఒక బ్యారేజ్‌లో ఒక పర్రె వడితే.. దానికి కాంగ్రెస్‌ నేతలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా లొల్లి పెట్టిండ్రు. మరి ఇవాళ సుంకిశాల రిటైనింగ్‌ వాల్‌ కూలిపోతే ఎవరు మాట్లాడరు. కాంగ్రెస్‌, బీజేపోడు నోరెత్తడు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ కూలిపోతే మాట్లాడరు. ఖమ్మం వద్ద పెద్దవాగు కొట్టుకుపోతే ఎవరు మాట్లాడరు. రేవంత్‌ రెడ్డికి రక్షణ కవచంలా బీజేపీ ఉంది. కాళేశ్వరంలో ఒక పిల్లర్‌కు పర్రె వడితే.. ఎన్డీఎస్‌ఏ వాలిపోయింది. మరి ఇవాళ ఎస్‌ఎల్‌బీసీలో టన్నెల్‌ కూలి దాదాపు 72 గంటలు అవుతుంది మరి ఎందుకు ఎన్డీఎస్‌ఏ రాలేదు. ఏ బీజేపోడు మాట్లాడడు. కిషన్‌ రెడ్డి, బండి సంజయ్‌ ఎందుకు మాట్లాడం లేదు. ఏం ఇబ్బంది వచ్చింది. సుంకిశాల కూలిపోతే గవినోళ్ల శ్రీనివాస్‌ ఆర్టీఐ కింద రఖాస్తు పెట్టుకుంటే.. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. సమాధానం ఇవ్వమని చెప్పారు అని కేటీఆర్‌ గుర్తు చేశారు. ఈ రెండే కాదు.. ఎన్నికల ప్రచారంలో మోదీ వచ్చి.. కాంగ్రెస్‌ పార్టీ అవినీతి ప్రభుత్వాన్ని నడుపుతుంది.. ఆర్‌ఆర్‌ ట్యాక్స్‌ వసూలు చేస్తున్నారని ప్రధాని గర్జించిండు. కానీ ఇంత వరకు చర్య లేదు. రేవంత్‌ రెడ్డి బామ్మర్ది కంపెనీ శోధా 2 కోట్ల లాభం ఆర్జించింది. అమృత్‌ స్కీంలో రూ. 1137 కోట్ల కాంటాక్ట్‌ ఇచ్చిండు బామ్మర్ది కంపెనీకి రేవంత్‌ రెడ్డి. దీని మీద విచారణ చేయాలని సంబంధిత కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశాం. ఆరు నెలలు అవుతంది.. ఇప్పటి వరకు స్పందన లేదు. పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డిపై ఈడీ రైడ్‌ అయింది.. ఏం జరిగిందో తెలియదు కానీ ఇప్పటి వరకు ఎవరూ నోరు విప్పడం లేదు. ఇవన్నీ దేనికి సంకేతం.. ఎవరు ఎవర్ని కాపాడుతున్నారు. రేవంత్‌ రెడ్డి బీజేపీ మీద పల్లెత్తు మాట మాట్లాడం లేదు. కేసీఆర్‌ మీదనే మాట్లాడుతున్నడు.

# మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదు

(మొదటి తరువాయి)

అమలు చేయలేదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పి జిల్లాకు 200 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు యువకులకు జవాబు చెప్పుకోక మత రాజకీయాలకు బండి సంజయ్‌ పాల్పడుతున్నారని ఆగ్రహించారు. చెప్పుకోవడానికి అభివృద్ధి లేదని.. సబ్జెక్టు అంతకన్నా లేదన్నారు. అందుకే బండి సంజయ్‌ నోరు తెరిస్తే హిందూస్తాన్‌, పాకిస్తాన్‌, హిందూ, ముస్లిం తప్ప మరో మాట తెలియదని విరుచుకుపడ్డారు. 'సూటిగా బండి సంజయ్‌ను అడుగుతున్నా... పట్టభద్రులకు మీరేం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? ఎంత ఉపాధి కల్పించారు? ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మారు. ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారు. దేవుని పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ... దేవునికి వినియోగించే అగర్బత్తిల మీద కూడా జీఎస్టీ వేసింది. ఉన్నత విద్య మీద 18% జీఎస్టీ విధిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతుంది. అలాంటి బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదు. తెలంగాణ విభజన హామీలు అమలు కాలేదు. ఎన్నికలప్పుడే హిందూ ముస్లిం అని రెచ్చగొడతారు. బండి సంజయ్‌.. పాకిస్తాన్‌తో పోల్చి భారతదేశం గొప్పతనాన్ని తగ్గించొద్దు. పాకిస్తాన్‌తో పోల్చి దేశాన్ని కించపరచడం తప్ప మీరు దేశానికి చేసింది లేదు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికన ఎన్నికల్లోకి రండి" అంటూ సవాల్‌ విసిరారు. ట్రైబల్‌ యూనివర్సిటీ పనులు కూడా మొదలుపెట్టలేనీ అసమర్థ కేంద్ర ప్రభుత్వం అంటూ విమర్శించారు. బండి సంజయ్‌కు చెప్పుకోవడానికి ఏం లేదని.. మాట్లాడడానికి రెండు మాటలు రావన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేయాలనుకుంటే.. భారత సరిహద్దుల్లో ఉన్న సైనికుల మాదిరిగా యుద్ధంలో పాల్గొనాలని ఉచిత సలహా ఇచ్చారు. ఆకలి చావులు అంతర్గత సమస్యలతో దివాలా తీసిన పాకిస్తాన్‌తో పోల్చి.. దేశాన్ని అవమానపర్చవద్దన్నారు. పాకిస్తాన్‌తో భారతదేశాన్ని పోల్చి దేశ గౌరవాన్ని బండి సంజయ్‌ తగ్గిస్తున్నారని.. దేశ గౌరవాన్ని తగ్గిస్తున్న బండి సంజయ్‌ను బీజేపీ పెద్దలు నియంత్రించాలని డిమాండ్‌ చేశారు. "భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన భారతీయులంతా నా సోదరులే అన్న మీరు భారత రాజ్యాంగాన్ని కాపాడతానని చెప్పిన మీరు.. అధికారం కోసం విద్వేష ప్రసంగాల అవసరమా. మీరు చేసింది శూన్యం. పట్టభద్రులారా ఆలోచించండి విద్యా వేత్త నరేందర్‌ రెడ్డికి ఓటు వేసి గెలిపించండి.

# మార్చి 1 నుంచే కొత్త రేషన్‌కార్డులు

(మొదటి తరువాయి)

ఒకటి నుంచి కొత్త రేషన్‌ కార్డులు జారీ చేయనున్నట్లు రేవంత్‌ రెడ్డి సర్కార్‌ ప్రకటించింది. మార్చి ఒకటిన ఒకే రోజు లక్ష కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌ నగర్‌ జిల్లాల్లో లక్ష కార్డులను అధికారులు పంపిణీ చేయనున్నారు. కొత్త జిల్లాల ప్రకారం.. హైదరాబాద్‌– 285, వికారాబాద్‌ జిల్లా– 22 వేలు, నాగర్‌కర్నూల్‌ జిల్లా– 15 వేలు, నారాయణపేట జిల్లా– 12 వేలు, వనపర్తి జిల్లా– 6 వేలు, మహబూబ్‌నగర్‌ జిల్లా– 13 వేలు, గద్వాల్‌ జిల్లా– 13 వేలు, మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా– 6 వేలు, రంగారెడ్డి జిల్లా– 24 వేలు చొప్పున లక్ష కార్డులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మార్చి 8 తర్వాత అన్ని జిల్లాల్లో పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కాగా, 2014 నుంచి తెలంగాణలో నూతన రేషన్‌ కార్డులు జారీ చేయలేదు. ఈ పదేళ్లలో లక్షల మంది వివాహాలు చేసుకుని వేరుకాపురాలు పెట్టారు. ప్రభుత్వ పథకాలు ఏమైనా అందాలంటే రేషన్‌ కార్డులు కీలకం. కార్డులు లేక అనేక మంది సంక్షేమ పథకాలను కోల్పోయిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు నూతన కార్డులు జారీ చేస్తున్నట్లు తీపి కబురు చెప్పింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది జనవరి 26న కూడా 16,900 కుటుంబాలకు రేషన్‌ కార్డులు మంజూరు చేశారు. మరోసారి ఈ ప్రక్రియ చేపట్టి మరికొన్ని కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రజాపాలన, గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. తాజాగా మీ సేవా కేంద్రాల ద్వారా కూడా అప్లికేషన్లు తీసుకుంటున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం అర్హులకు నూతన కార్డులను మంజూరు చేయనున్నారు.

# 27 న పట్టభద్ర, టీచర్‌ ఎమ్మెల్సీ ఎన్నికలు

(మొదటి తరువాయి)

కాంగ్రెస్‌, బీఎస్పీ అభ్యర్థుల మధ్య ముక్కోణపు వార్‌ జరుగనుంది. బీజేపీ కాంగ్రెస్‌ అభ్యర్థుల తరుపున పార్టీ అగ్రనేతలు ప్రచారం చేశారు.. కాంగ్రెస్‌ అభ్యర్థికి మద్దతుగా సీఎం రేవంత్‌, పీసీసీ చీఫ్‌ మహేష్‌ గౌడ్‌ పలువురు మంత్రులు ప్రచారం చేయగా.. బీజేపీ అభ్యర్థికి మద్దతుగా కేంద్ర మంత్రి కిషన్‌ రెడ్డి.. బండి సంజయ్‌ పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రచారం చేశారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు అధికారులు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 3,55,159 మంది పట్టబద్ర ఓటర్లు, 27088 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. గ్రాడ్యుయేట్‌ స్థానంలో 499 పోలింగ్‌ కేంద్రాలు, టీచర్‌ స్థానంలో 274 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశారు అధికారులు. ఈనెల 27 న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్‌ జరుగనుంది. మార్చి 3 న ఓట్ల లెక్కింపు ఉంటుంది. అయితే.. మెదక్‌–నిజామాబాద్‌–ఆదిలాబాద్‌–కరీంనగర్‌ పట్టభద్రుల స్థానంలో 56 మంది పోటీలో ఉండగా..మొత్తం ఓటర్లు 3,41,313 మంది ఉండగా పురుషులు 2,18,060 మంది, మహిళలు 1,23,250 మంది, ఇతరులు ముగ్గురు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# గల్లంతైన వారి రక్షణకు చర్యలు

(మొదటి తరువాయి)

లేకపోవడంతో తిరిగి వచ్చాయి. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి మాట్లాడుతూ.. రెస్క్యూ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా తిరిగి తీసుకురావడానికి సర్వ శక్తులా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో అత్యంత నిపుణులైన 10 ఏజెన్సీలు ఈ రెస్క్యూలో పనిచేస్తున్నాయి.. ఇండియన్‌ ఆర్మీ, ఇండియన్‌ నేవీ, ఎన్డీఆర్‌ఎఫ్‌, ఎస్డీఆర్‌ఎఫ్‌, సింగరేణి, జియాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా, నేషనల్‌ రిమోట్‌ సెన్సింగ్‌ అన్నీ కలిసి పనిచేస్తున్నాయని మంత్రి ఉత్తమ్‌ తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.. ప్రమాదం జరిగిన వెంటనే వేగంగా స్పందించామని మంత్రి పేర్కొ?న్నారు. ఇలాంటి ప్రమాదాల్లో రెస్క్యూ ఆపరేషన్స్‌ చేసే అనుభవం ఉన్న వాళ్ళను కూడా ఆహ్వానిస్తున్నాం.. మేము ఇంత చేస్తుంటే.. కొందరు చిల్లర రాజకీయం చేస్తున్నారని ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి దుయ్యబట్టారు. కాళేశ్వరంలో ఏడుగురు చనిపోతే మేము మాట్లాడలేదు.. శ్రీశైలం పవర్‌ ప్లాంట్‌ లో కూడా ఎనిమిది మంది చనిపోతే కూడా ఏనాడు మాట్లాడలేదని ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన ప్రమాదం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. దేశంలోనే గొప్ప ప్రాజెక్టు ఇది.. 45 కి.మీలలో 30 కి.మీ పూర్తి అయ్యిందని మంత్రి ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు మినిమం సెన్స్‌ లేకుండా మాట్లాడుతున్నాయి.. ప్రాజెక్ట్‌ పూర్తి ఐతే నల్గొండ జిల్లాలో లక్షల ఎకరాలకు నీరు అందుతుంది.. ఫ్లోరైడ్‌ బాధ తొలుగుతుందని తెలిపారు. బీఆర్‌ఎస్‌ హయాంలో 10 ఏళ్ల పాటు ప్రాజెక్ట్‌ పనులు నిలిపివేశారని మంత్రి ఆరోపించారు. మరోవైపు.. టన్నెల్‌లో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడటానికి సర్వ శక్తులా కృషి చేస్తున్నాం.. ప్రమాదం జరిగిన స్థలంలో నీరు లీక్‌ అవుతోంది.. నీటి ఉధృతి కూడా పెరిగిందని రెస్క్యూ టీమ్స్‌ చెప్తున్నాయని మంత్రి ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి చెప్పారు.

# హైదరాబాద్‌లో మోగుతున్న డేంజర్‌ బెల్స్‌

(మొదటి తరువాయి)

ఎయిర్‌ క్వాలిటీ ప్రమాదకర స్థాయికి చేరుకుంది. సోమవారం (ఫిబ్రవరి 24న) రోజున ఏకంగా 431 ఏక్యూఐ నమోదైంది. సోమవారం మధ్యాహ్నం 3.05 గంటల ప్రాంతంలో ఈ వ్యాల్యూ నమోదైనట్టు పేర్కొన్న టీటీపీసీబీ అధికారులు.. క్రమంగా ఈ లెవెల్స్‌ తగ్గుతూ వచ్చినట్టు తెలిపారు. మరోవైపు.. నగరంలో సగటున 108 ఏక్యూఐ నమోదైనట్టు అధికారులు తెలిపారు. మరోవైపు.. జూపార్క్‌లో 135, పటాన్‌ చెరువులో 112 తప్ప గ్రేటర్లో గాలి నాణ్యతను సూచించే 14 స్టేషన్లలో ఎక్కడా 100 ఏక్యూఐ దాటలేదని అధికారులు స్పష్టం చేశారు. ఎయిర్‌ క్వాలిటీ ఇండెక్స్లో గాలి నాణ్యత 0 నుంచి 50లోపు నమోదైతే ఆ గాలి స్వచ్ఛంగా ఉన్నట్టని.. అదే 51 నుంచి 100 వరకు ఉంటే గాలి నాణ్యత సంతృప్తికర స్థాయిలో ఉందని తెలిపిన అధికారులు.. 101 నుంచి 200 మధ్య ఉంటే కాస్త అనారోగ్యకరమని, 200 నుంచి 300 వరకు ఉంటే పూర్‌ క్వాలిటీ అని, 301 నుంచి 400 వరకు ఉంటే వెరీ పూర్‌ క్వాలిటీ అని పేర్కొన్నారు. ఇక.. 401 నుంచి 500 వరకు ఉంటే మాత్రం అది అత్యంత ప్రమాదకర స్థాయి అని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో.. సోమవారం సనత్నగర్లో 431 ఏక్యూఐ నమోదు కావటం కాస్త ఆందోళన కలిగించే అంశంగా అధికారులు పేర్కొన్నారు. గతేడాది.. నవంబర్‌ 25వ తేదీన సనత్నగర్లో 298, డిసెంబర్లో 229, జనవరిలో 171 ఏక్యూఐ నమోదైంది. అయితే.. సనత్‌ నగర్‌ ఇండస్ట్రియల్‌ ప్రాంతం కావడంతో అక్కడ సాధారణంగానే అసాధారణ వ్యాల్యూస్‌ నమోదవుతుంటాయని అధికారులు తెలిపారు. అయితే.. ఎప్పుడూ లేనంతగా సోమవారం రోజున ప్రమాదకర స్థాయిలో వ్యాల్యూస్‌ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

## తెలుగు పంచాంగం 26/2025,మంగళవారం



**సమయ సమాచారం:**
సూర్యోదయం: ఉదయం 6:38
సూర్యాస్తమయం: సాయంత్రం 6:17
**తిథి:**
కృష్ణ పక్ష త్రయోదశి
ప్రారంభం: ఫిబ్రవరి 25 మధ్యాహ్నం 3:24
ముగింపు: ఫిబ్రవరి 26 మధ్యాహ్నం 4:50
కృష్ణ పక్ష చతుర్దశి
ప్రారంభం: ఫిబ్రవరి 26 మధ్యాహ్నం 4:50
ముగింపు: ఫిబ్రవరి 27 రాత్రి 6:35
**నక్షత్రం:**
శ్రవణం
ప్రారంభం: ఫిబ్రవరి 25 రాత్రి 10:01
ముగింపు: ఫిబ్రవరి 26 రాత్రి 11:59
ధనిష్ఠ
ప్రారంభం: ఫిబ్రవరి 26 రాత్రి 11:59
ముగింపు: ఫిబ్రవరి 28 ఉదయం 2:00
**శుభ సమయాలు:**
అమృతకాలం: సాయంత్రం 5:57 నుండి 7:38 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:06 నుండి 12:52 వరకు
**అశుభ సమయాలు:**
రాహుకాలం: మధ్యాహ్నం 12:28 నుండి 1:55 వరకు
యమగండం: ఉదయం 8:52 నుండి 10:19 వరకు
దుర్ముహూర్తం: మధ్యాహ్నం 11:17 నుండి 12:05 వరకు
వర్జ్యం: ఉదయం 9:02 నుండి 10:42 వరకు

# నైపుణ్యం ఉన్న స్వయం ఉపాధిని ఎన్నుకోవడం ఉత్తమం

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి,ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నేటి యువత తమకు ఉన్ననైపుణ్యంఉన్న స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవడం ఉత్తమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు మంగళవారం శివ స్వాములకు వీడ్కోలు పలికేందుకు చింతల హనుమాన్ ఆలయానికి వెళ్లిన నిరంజన్ రెడ్డి ఆలయ సమీపంలో ఉన్న ఒక టీ స్టాల్ లోకి వెళ్లి అక్కడ కార్యకర్తలతో కాసేపు ముచ్చటించి టి సేవించారు, ఈ సందర్భంగా ఆయన టీ యజమానితో మాట్లాడుతున్న సందర్భంలో యువత నైపుణ్యం ఉన్నటువంటి వృత్తిని వ్యాపారాలను ఎన్నుకొని వాటిలో రాణించాలని ఆ యజమానిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న పలువురిని ఆప్యాయంగా పలకరిస్తూ ఆనందంగా కాసేపు కార్యకర్తలతో గడిపారు.

# రాగి అంబలి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



**కడ్తాల, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కడ్తాల బస్టాండ్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో ఈ నెల 12న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ డి. కోటేశ్వర్ రావు చేతుల మీదుగా ప్రారంభమైన రాగి అంబలి కేంద్రం రోజువారీగా కొనసాగుతుందని లయన్స్ క్లబ్ వర్గాలు తెలిపాయి. వేసవికాలంలో బాటసారులకు మరియు ప్రయాణికులకు రాగి అంబలి తీసుకోవడం వల్ల పౌష్టికాహారం లభిస్తుందని, ప్రతిరోజు 350 మందికి రాగి జావా అందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ పసుల లక్ష్మారెడ్డి, కార్యదర్శి దోనాదుల మహేష్, కోశాధికారి గుజ్జరి నరసింహ, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, పాషా,చేగూరి వెంకటేష్, బిచ్చ నాయక్, గుగిళ్ళ లక్ష్మయ్య, గంప శ్రీనివాస్, దూదే రాజేందర్, డ్రైవర్ రాజు, లియో తరుణ్, పిప్పల వెంకటేష్, గోవర్ధన్ రెడ్డి, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, వేణు పంతులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# టీ ఎస్ సి పి ఎస్ ఇ యూ ఆధ్వర్యంలోమార్చి2న హైదరాబాద్

**-ఇందిరాపార్క్ వద్ద ధర్నా**
**-సన్నాహక సమావేశం నిర్వహించిన వనపర్తి జిల్లా శాఖ**



**వనపర్తి,ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఆధ్వర్యంలో సిపిఎస్ విధానం రద్దు చేయాలని,యుపిఎస్ పై యుద్ధభేరి ప్రకటిస్తూ హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద మార్చి 2 వ తారీకు ఆదివారం చేపట్టబోయే ధర్నా కార్యక్రమం సన్నాహక సమావేశం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మద్దిలేటి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని 15 మండల కేంద్రాల నుంచి వనపర్తి జిల్లా కేంద్రం నుండి అధిక సంఖ్యలో సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ధర్నా కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరడమైనది. ఈ సమావేశంలో టీ ఎస్ సి పి ఎస్ ఇ యూ రాష్ట్ర కార్యదర్శి మోహన్ బాబు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ రమేష్ బండి శీను ఈశ్వర్ మల్లికార్జున్ మహేశ్వర జారి నరేష్ కిరణ్ సురేష్ శివ నరసింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వర్గ పోరుతో కుంటుపడుతున్న వనపర్తి అభివృద్ధి

**-బోగస్ శంకుస్థాపనలు చేయడం మాని.. ఆచరణలో చూపించండి**
**-మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. నారాయణ**




**వనపర్తి,ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తిలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో ఎమ్మెల్యే
మేఘా రెడ్డి,ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మధ్య విభేదాలుభగ్గుమన్నాయని బోగస్ శంకుస్థాపనలు చేయడం మాని ఆచరణలో చూపించాలని కాంగ్రెస్ వర్గ పోరుతో వనపర్తిలో అభివృద్ధి కుంటుపడిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. నారాయణ తీవ్రంగావిమర్శించారు మంగళవారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి జిల్లా మీడియా ఇన్చార్జి పెద్దిరాజు ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలతో మాటున అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం..హామీల అమలు గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు పూర్తి చేస్తామని చెప్పి కేవలం 20 వేలకు పరిమితమయ్యారని.. హామీల అమలు చేతకాక రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారని విమర్శించారు.

**– బిఆర్ఎస్ కు పట్టిన గతి కాంగ్రెస్ కు తప్పదు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బి రెడ్డి వెంకట్ రెడ్డి**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని.. కేసిఆర్ పాలనలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి కాకుండానే వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసి శంకుస్థాపనల పేరిట హడావిడి చేశారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బి రెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. మోటర్లు మునిగిపోయి కాలిపోయిన పట్టించుకోని కారణంగానే బిఆర్ఎస్ పార్టీని ప్రజలు బొంద పెట్టారని.. కాంగ్రెస్ కూడా సాగునీటి ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని ఆ నిర్లక్ష్య ఫలితమే ఎస్ఎల్బీసీ టన్నెల్ లో పనిచేసే కార్మికులు మూడు రోజులుగా ఆచూకీ లేకపోయినా ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ధ్యాస తప్ప ప్రజల ప్రాణాల పైన లేదని విమర్శించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం తదితర రాష్ట్రాలలో అత్యాధునిక సాంకేతికతతో టన్నెల్ నిర్మాణాలు పూర్తయి వినియోగంలోకి వచ్చాయని.. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమే నేటి ప్రమాదానికి కారణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర మేల్కొని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం,జిల్లా అధికార ప్రతినిధి జిల్లా మీడియా ఇన్చార్జి పెద్దిరాజు,ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి, ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు ఆగపోగు కుమార్,పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి పురస్కరించుకుని రామేశ్వరంలో ఏర్పాట్లను పరిశీలించిన సిఐ విజయ్ కుమార్

**-భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేసిన భారీకేడ్లు, సదుపాయాల పరిశీలన**



**షాద్ నగర్,ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఉత్తర రామేశ్వరం పవిత్ర పుణ్యక్షేత్రం బ్రహ్మోత్సవాలలో భాగంగా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్షలాదిమంది భక్తులు దర్శనార్థం వస్తున్న క్రమంలో పోలీసులు పుణ్యక్షేత్రం వద్ద భక్తులకు సంబంధించిన క్యూలైన్లు, అదేవిధంగా భారీకేడ్లను పరిశీలించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ వాహనాల రాకపోకలు రద్దీ పరిస్థితులను పరిశీలించారు. శివరాత్రి పర్వదినాన షాద్ నగర్ నియోజకవర్గ నుండే కాకుండా ఇతర నియోజకవర్గాలు జడ్చర్ల, మహబూబ్ నగర్, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, హైదరాబాద్ ఇంకా ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు ఆలయాన్ని సందర్శించనున్నారు. ఓవైపు జాతర మరోవైపు శివరాత్రి వేడుకలు ఘనంగా జరగనున్న నేపథ్యంలో భక్తులు ఉపవాస దీక్షల విరమణ అదేవిధంగా జాగరణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. ఉదయం సాయంత్రం రాత్రి వేళలో భక్తులు వేలాదిగా తల్లి వచ్చే అవకాశాలు ఉండడంతో ఇక్కడ ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. అయితే మంగళవారం రామేశ్వరం ఆలయాన్ని సిఐలు విజయకుమార్ చంద్రశేఖర, ఎస్సై శరత్ కుమార్ తదితరులు ఇక్కడ సౌకర్యాల గురించి ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తామని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు..

# భూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

**– ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**చందంపేట, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చందంపేట మండల పరిధిలోని తెల్దేవరపల్లి గ్రామానికి చెందిన నక్కల గండి ప్రాజెక్టు కింద నష్టపోయిన భూ నిర్వాసితుల సమస్య పరిష్కారం కోసం, వారి సమస్యలు విని సంబంధిత అధికారులను ఆదేశించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా, భూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అని, త్వరలో ముఖ్యమంత్రి దృష్టిలో తీసుకెళ్లి, వారి సమస్యలు పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ప్యాకేజ్ ద్వారా భూ నిర్వాసితులకు ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాకుండా, వారి జీవనోన్నతికి అవసరమ్మైన సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని వెల్లడించారు. నక్కల గండి ప్రాజెక్టు వంటి అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రగతికి ముందు అడుగు వేయిస్తాయని, ప్రాజెక్టుల ద్వారా ప్రభావితమ్మైన ప్రజల హక్కులు, జీవన ఉపాధితో పాటు నష్టం కాకుండా చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. భూమి కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందించడం, కొత్త జీవనశ్కెలిని ఏర్పరచుకునే అవకాశం కల్పించడం, సమగ్ర పునరావాస పథకాలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బుజ్జి లచ్చిరామ్ నాయక్, మాజీ ఎంపీపీ బిక్కు నాయక్, శుక్కో నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ మహా లక్ష్మయ్య, సీనియర్ నాయకులు భరత్ కుమార్, గ్రామ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

# శివరాత్రి ఉపవాసం, జాగారానికి అంతరార్థం - భక్తి, త్యాగం, ఆధ్యాత్మిక మార్గదర్శకం

భారతీయ సంస్కృతిలో మహాశివరాత్రి అత్యంత పవిత్రమైన పర్వదినంగా ప్రసిద్ధి చెందింది. శివుని భక్తులు ఉపవాసం, జాగారం, రుద్రాభిషేకం, శివపంచాక్షరి మంత్రజపం ద్వారా ఈ రోజును గొప్ప భక్తిభావంతో జరుపుకుంటారు. అయితే, ఈ ఆచారాల వెనుక ఉన్న గాఢత, తాత్పర్యం ఏమిటి? ఎందుకు భక్తులు రాత్రంతా మేల్కొని శివనామ సంకీర్తన చేస్తారు? ఈ ప్రశ్నలకు పురాణాల నుండి ఆధ్యాత్మిక శాస్త్రాల వరకు వివిధ కోణాల్లో విశ్లేషణ చేయాలి.

**శివరాత్రి - పురాణ పరంపర**

పురాణాల ప్రకారం, దేవతలు, అసురులు కలిసి అమృతం కోసం క్షీరసాగర మథనం చేపట్టారు. అయితే, అమృతం పుట్టక ముందే హాలాహల మహావిషం ఉద్భవించింది. ఆ గరళం ప్రపంచాన్ని నాశనం చేసే ప్రమాదం ఉండటంతో భయపడిన దేవతలు శివుని ఆశ్రయించారు. లోకక్షేమం కోసం మహాదేవుడు ఆ గరళాన్ని మింగి తన కంఠంలో బంధించుకున్నాడు, దాంతో ఆయన నీలకంఠుడు అయ్యాడు. అయితే, హాలాహల ప్రభావంతో శివుడు తీవ్రమైన తాపానికి గురయ్యాడు. ఆ తాపాన్ని తగ్గించేందుకు దేవతలు, ఋషులు రాత్రంతా మేల్కొని భజనలు చేశారు. వారి ఈ జాగారం ఆచారంగా మారి, భక్తులు ఈ రోజున శివునికి అర్పణగా ఉపవాసం చేస్తారు, రాత్రంతా శివనామ స్మరణ చేస్తారు.

**శివరాత్రి ఉపవాస దీక్ష - ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత**

శివరాత్రి ఉపవాసానికి పౌరాణిక నేపథ్యం మాత్రమే కాకుండా ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయి. శరీరాన్ని కొంతకాలం ఆహారం లేకుండా ఉంచడం ద్వారా జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి లభిస్తుంది. అంతేకాక, ఉపవాస సమయంలో మనస్సు ప్రశాంతంగా మారి, ఆధ్యాత్మిక ధ్యానానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది.

**శివరాత్రి రోజు పాటించాల్సిన నియమాలు**

-ఉపవాస దీక్ష - శరీర, మనసు శుద్ధి
-రాత్రి జాగారం - శివనామ సంకీర్తన
-శివలింగాభిషేకం - హాలాహల ప్రభావాన్ని తగ్గించే పవిత్ర క్రతువు
-శివపురాణం, లింగాష్టకం పారాయణం

**రుద్రాభిషేకం శక్తి మరియు విశిష్టత**

శివరాత్రి రోజున రుద్రాభిషేకం అత్యంత శక్తివంతమైన పూజగా పరిగణించబడుతుంది. పురాణాల ప్రకారం, శివుని అభిషేకం వల్ల భక్తులకు ఆరోగ్యం, ధనసంపత్తి, శాంతి లభిస్తుందని విశ్వాసం.

**రుద్రాభిషేకం ప్రత్యేకత**

-జ్ఞానం, ఆయురారోగ్యం, ధనసంపత్తి పొందే అవకాశం
-శత్రుబాధలు, దోషాలు తొలగిపోతాయి
-శివాభిషేకం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారి, ఆధ్యాత్మికంగా ఎదుగుతుంది
-భక్తి, ధ్యానం, కర్మ ఫలితంగా శివుని అనుగ్రహం లభిస్తుంది

**శివరాత్రి ఆధ్యాత్మిక తాత్పర్యం**

శివరాత్రి కేవలం ఒక ఆచారాన్ని పాటించే రోజు మాత్రమే కాదు. ఇది మన జీవన విధానానికి, ఆధ్యాత్మిక మార్గానికి మార్గదర్శకమైన శుభతిథి. శివుడు హాలాహలాన్ని మింగి లోకాన్ని రక్షించడమే కాక, భక్తులకు ఆధ్యాత్మికంగా జ్ఞాన మార్గాన్ని చూపించాడు.

-శివుడు ఏకత్వాన్ని సూచిస్తాడు - జీవ, బ్రహ్మ పరమార్థంలో ఒక్కటే
-శివుని అభిషేకం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారుతుంది
-శివపంచాక్షరి మంత్రం (ఓం నమః శివాయ) అద్వితీయమైన శక్తిని కలిగి ఉంటుంది
- శివతత్వాన్ని గ్రహించేవారికి జీవితం సాఫల్యమవుతుంది

**శివరాత్రి విశేషం -జాగారం ఆచారానికి వెనుక ఉన్న కారణం**

శివరాత్రి రోజున భక్తులు రాత్రంతా మేల్కొని, శివనామ స్మరణ, పారాయణ, భజనలతో రాత్రిని గడుపుతారు.

-పురాణాల ప్రకారం, హాలాహలం మింగిన అనంతరం శివుడు మూర్ఛ పోయాడట, దేవతలు, ఋషులు శివుని మేల్కొల్పేందుకు రాత్రంతా భజనలు చేశారు.
- ఇది భక్తులకు తపస్సును సూచించే ప్రాముఖ్యమైన ఆచారం.
-రాత్రి జాగారం చేయడం ద్వారా మన చైతన్య స్థాయిని పెంచుకోవచ్చు, ధ్యానం ద్వారా మనస్సును స్థిరపరచుకోవచ్చు.

**శివరాత్రి ఉపవాసం, జాగారానికి ఉన్న ఇతర ప్రయోజనాలు**

-మనోనిగ్రహం - ఉపవాసం ద్వారా మనం మనస్సును అదుపులో ఉంచుకోవచ్చు.
- శక్తి సమాహారం - శివనామ సంకీర్తన వల్ల ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుంది.
ఓధర్మం, భక్తి మార్గంలో ముందుకు సాగే అవకాశం.
-కర్మ ఫలాలను శివునికి అర్పించడం ద్వారా పాప విమోచనం.

**శివరాత్రి అనుబంధం**

భారతీయ సాంప్రదాయాల్లో మహాశివరాత్రి ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఇది భక్తులకు భగవంతుని తత్వాన్ని అనుసంధానించేందుకు గొప్ప అవకాశం. ఈ రోజున ఉపవాసం, జాగారం, ధ్యానం ద్వారా భౌతిక, ఆధ్యాత్మిక స్థాయిలో శివుని అనుగ్రహం పొందే అవకాశం ఉంటుంది.

- భక్తి - శివనామ స్మరణ
-తపస్సు - జాగారం, ధ్యానం
- సమర్పణ - ఉపవాసం, పూజా విధానం
- తత్వశుద్ధి - రుద్రాభిషేకం

శివరాత్రి ఉపవాసం, జాగారం కేవలం ఆచారాల పరిమితి కాదు. ఇది భక్తికి, ఆధ్యాత్మిక సాధనకు, లోకక్షేమం కోసం శివుని ఆరాధనకు మేలైన అవకాశంగా భావించాలి. ఈ పవిత్ర తిథిని సద్వినియోగం చేసుకుని శివతత్వాన్ని ఆస్వాదించగలిగితే, మన జీవిత ప్రయాణం మరింత ధన్యమైనదిగా మారుతుంది.

ఓం నమః శివాయ!

వ్యాస కర్త
చెరుకు జంగయ్య గౌడ్



# పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

## శివస్వాముల ఇరుముడి కార్యక్రమములో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి,ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** శివరాత్రి సందర్భంగా శివస్వాములు శ్రీశైలమల్లికార్జున స్వామి దర్శనం కోసం ఇరుముడులతో బయలుదేరుతున్న సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి వీడ్కోలు పలికారు. గురుస్వామి ధర్మయ్య యాదవ్,అంజిగురుస్వామి,తోట.శ్రీను,బెంగాలీ.రఘు స్వాములు, సాదరంగా ఆహ్వానించి నిరంజన్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగానిరంజన్ రెడ్డి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో దీక్ష చేసిన స్వాములు సురక్షితంగా స్వామి దర్శనం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట గట్టు యాదవ్, నందిమల్ల.అశోక్, ఉంగ్లమ్. తిరుమల్,నాగన్న యాదవ్,బండారు.కృష్ణ, దేవర్ల.నరసింహ,ప్రభాకర్,ఇమ్రాన్,చిట్యాల.రాము,ముని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**పెద్దమందడి,ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పెద్దమందడి మండలం మద్దిగట్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రోజు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తమ బాధితులను చక్కగా నిర్వర్తించారని ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారిగా వాణిశ్రీ, ప్రధానోపాధ్యాయులు గా అనిత అదేవిధంగా 13 మంది చిన్నారులు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాజు ఉపాధ్యాయులు రమేష్, విష్ణు, మోజెర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగంధర్,ఉపాధ్యాయులు వెంకటయ్య,పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులనుఅభినందించి,బహుమతులు అందజేశారు.

## ప్రజా పాలనలో ప్రజల పాట్లు



**నల్గొండ, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ ప్రజా పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవడం వల్ల ప్రజా క్షేమాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని పలువురు విమర్శిస్తున్నారు. నల్గొండ జిల్లా చింతపల్లి మండలంలోని కుర్మేడు గ్రామ పంచాయతీకి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని గ్రామ ప్రజలు రోడ్డు మీద బైటాయించి నిరసన వ్యక్తం చేశారు.

# పది రోజులుగా మంచినీటి పైప్లైన్లు మరమ్మతులు చేస్తున్నాం





**-వేసవిలో నీటి కొరత లేకుండా పంపిణీ చేయడం నా బాధ్యత**
**-మాజీ కౌన్సిలర్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి**

**వనపర్తి,ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పది రోజులుగా ప్రయత్నం చేసిన 29 వ వార్డులో రామన్నాపడు వాటర్ పైప్లైన్ లీకేజ్ జాడ దొరకడం లేదు, ఈ వేసవిలోనీటి కొరత లేకుండా పైప్లైన్లు మరమ్మతులు చేయడము నా బాధ్యత అని 29వ వార్డు మాజీ కౌన్సిలర్ భారతిప్రేమ్నాథ్ రెడ్డి మంగళవారంఅన్నారు. గత కొంతకాలంగా త్రాగునీరు కలుషితంగా పంపిణీ చేస్తున్నారని కాలనీవాసులు ఫిర్యాదులు చేసినందుకు సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ఎక్కడ వాటర్ పైప్లైన్ లీకేజీ జరిగింది ఇక్కడ డ్రైనేజ్ వాటర్తో కలుస్తుందని తెలుసుకోవడానికి మున్సిపల్ వాటర్ సప్లై అధికారులతో కలిసి ప్రయత్నం చేస్తూఒకటి రెండు చోట్ల సరిచేసినప్పటికీ సమస్య సాలు కాకపోవడంతో మంగళవారం 29వ వార్డులోని ప్రధాన పైప్లైన్ కె ఎస్ ఎన్ చారీ ఇంటి ముందు ప్రధాన పైప్లైన్ కు వున్నా కనెక్షన్లను స్థానిక మాజీ కౌన్సిలర్ భారతిప్రేమాత్ రెడ్డి మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి, వారికిఅందుబాటులో ఉండి సమస్య సాలు అయ్యేవరకు ప్రతి కనెక్షన్ ను పరిశీలన చేయాలని ఈ సమస్య ఇదే విధంగా కొనసాగితే అవసరమైతే కొత్త పైప్లైన్ వేసి అయినా సరే ఈ వేసవికాలంలో నీటి కొరత లేకుండా మంచినీరు అందించే బాధ్యత తీసుకుంటానని వారుఅన్నారు.

# కొల్లాపూర్‌లో భక్తి శ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమం



**కొల్లాపూర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కొల్లాపూర్ పట్టణంలో ఇరుముడి కార్యక్రమం ఘనంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శివనామ స్మరణలతో ప్రాంగణాలు మార్మోగిపోగా, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం 60 మందితో కూడిన శివ స్వాముల బృందం కొల్లాపూర్ నుండి శ్రీశైలంకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ యాత్రలో సతీష్, మహేష్, కుమార్, కిరణ్, వినోద్ తదితరులతో పాటు వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా భక్తులు "ఓం నమః శివాయ" నినాదాలతో గగనభేరి మోగించి, భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనం కోసం భక్తులు నడకయాత్ర చేపట్టడం ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని పంచిందని నిర్వాహకులు తెలిపారు.

# చెట్టు = అమ్మ,
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

## అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం



**కల్వకుర్తి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కల్వకుర్తి పట్టణంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 33వ వార్షిక బ్రహ్మోత్సవాల వేడుకల సందర్భంగా శ్రీ స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నిర్వహించిన ఈ కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆలయ అర్చకులు మరియు వేదపండితులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, సీఐ నాగార్జున హాజర్కై, స్వామివారికి పూజలు చేసి, అనంతరం ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ వారు స్వామి వారి కండువాలు కప్పి సన్మానించారు. మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, పట్టణ ప్రజలు మరియు భక్తులు భారీగా పాల్గొన్నారు.

## శ్రీశైలం యాత్రలో నిబంధనలు పాటించాలని సూచించిన ఎస్పీ



**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం వెళ్ళే భక్తులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రంగనాథ్ సూచించారు. కాలి నడకన వెళ్లే శివ స్వాములతో పాటు వాహనదారులు అటవీ శాఖ నిబంధనలను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. అటవీ శాఖలో ఉన్న వన్యమృగాలకు ఎలాంటి హాని తలపెట్టవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# మున్సిపాలిటీల పరిధిలో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలివేగంగా లక్ష్యాలను సాధించాలి

**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి,ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి, నల్ల పన్నుల వసూళ్లపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని, వేగంగా లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో జంగిడిపురం ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్, మున్సిపాలిటీ సిబ్బంది టాక్స్ వసూలు చేస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రాపర్టీ, నల్లా పన్నుల వసూళ్ల వేగం పెంచాలని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించడానికి వీల్లేదని సూచించారు. బ్లాక్ ల వారీగా పన్నువసుల కోసం నియమించిన సిబ్బందికి పకడ్బందీగా శిక్షణ ఇచ్చి వేగంగా పన్నులు వసూలు అయ్యేలా చూడాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పన్నుల వసూళ్లపై పనిచేయాలన్నారు. బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉదయం 7 గంటలకు పురపాలక కార్యాలయంలో హాజరు వేసి క్షేత్రస్థాయిలో విధులకు హాజరై పన్నుల వసూలు మొదలు పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో పన్ను వసూళ్ల కోసం వెళ్లే సిబ్బంది వద్ద తప్పనిసరిగా అత్యధిక బకాయిలు ఉన్న వారి జాబితా ఉండాలని సూచించారు. పేమెంట్స్ ఏ విధంగా తీసుకోవాలని విషయంపై వారికి అవగాహన కల్పించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. బకాయిలు ఉన్నవారికి నోటీసులు పంపించాలని పోస్ట్ ద్వారా, డోర్ టు డోర్ వెళ్లినప్పుడు కూడా నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బల్క్ మెసేజ్ ల ద్వారా కూడా బకాయిదారులకు పన్ను చెల్లింపు పై సందేశాలను పంపించాలని సూచించారు. అదేవిధంగా, అన్ని బ్లాక్లలో పన్నువసుళ్ళకై ప్రత్యేక క్యాంపులు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందిని పనితీరును సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. ఇక పురపాలక పరిధిలో నల్లచెరువు ట్యాంక్ బండ్ సుందరీకరణ, అభివృద్ధి పనుల కోసం వేగంగా టెండర్లను పిలిచి గ్రౌండింగ్ స్టార్ట్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకి ఆదేశించారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఇతర పురపాలక సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# కేశంపేట లో ఆరోగ్య మహిళ కార్యక్రమం పరిశీలన

**-డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వి విజయలక్ష్మి**

**షాద్ నగర్,ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

షాద్ నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కేశంపేటలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా ప్రోగ్రామ్ను సడన్ విజిట్ చేసి, ఆరోగ్య మహిళా ప్రోగ్రాంలో నిర్వహించిన ఓ.పి రిజిస్టర్ ను మరియు ఆరోగ్యం మహిళా ప్రోగ్రాం లో కలెక్ట్ చేసిన బ్లడ్ షాంపూల్స్ ని పరిశీలించారు. అక్కడి డాక్టర్ నికిత గారితో మాట్లాడుతూ మహిళా ప్రోగ్రాంలో ఓపిని 100 దాకా పెంచాలని, ఈ ప్రోగ్రాం లో వచ్చిన మహిళలందరికీ రక్త నమూనాలు సేకరించి, వారికి కావలసిన పరీక్షలన్నీ నిర్వహించుటకు తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ కొండాపూర్ ఆసుపత్రికి పంపాలని చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన బి.పి మరియు షుగర్ పేషెంట్ లందరికీ నెలకు సరిపడా మందులు వారికి అందజేయాలని, అలాగే ఆస్పత్రి కాన్పులు పెంచాలని డాక్టర్ నికిత కి చెప్పారు. అక్కడికి వచ్చిన పి.హెచ్. సి స్టాప్ తో మరియు ఆశాలతో మాట్లాడుతూ వారి వారి యొక్క సబ్ సెంటర్లో ఉన్న ప్రజలందరికీ అబ్బా కాడు క్రియేషన్ చేసి ఇవ్వాలని, గ్రామాలలో 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి బీపీ షుగర్ పరీక్షలు చేయాలని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు.



**కేజీబీవీ పాఠశాల సందర్శించిన డాక్టర్ వి విజయలక్ష్మి**

కేశంపేట దగ్గర్లో ఉన్న పాతిగడ్డ తండాలోని కేజీబీవీ పాఠశాలను డాక్టర్ విజయలక్ష్మి సడన్ విజిట్ చేసి, ఆ స్కూల్లోని పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వారి యొక్క భోజనం మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. తదుపరి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి, పోషకాహారము గురించి, వేసవి కాలంలో తీసుకోవలసిన యొక్క జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థులందరూ కూడా ప్రతిరోజు ప్రాతఃకాలం లేవంగానే కాలకృత్యాలు తీర్చుకొని, స్నానం చేసి ఉతికిన బట్టలు ధరించి సమయానికి టిఫిన్ చేసి, శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షల ముందు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా, భయపడకుండా, నిర్భయంగా వచ్చిన జవాబులు ముందు ముందు రాయాలని, తదుపరి ప్రశ్నలకు ఆలోచించి జవాబులు రాయాలని, పదవ తరగతి విద్యార్థులకు డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నికిత, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, ఎం పి హెచ్ ఈ ఓలు నరసింహారెడ్డి, ఉపేందర్ రెడ్డి, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ గౌసియా బేగం, ఏఎన్ఎం పార్వతి, పి హెచ్ సి స్టాప్ మరియు ఆశాలు పాల్గొన్నారు..

# కాంగ్రెస్ గెలుపుకు ప్రయత్నం చేసింది చిన్నారెడ్డి

**-నీళ్లు తాగి పార్టీకి పని చేశాం.ఖజానా ఆశించి కాదు**

**-వలసవాదులతో పార్టీని నడిపితే భవిష్యత్తులో మనుగడ ఉండదు**

**-ప్రజా ఆశీస్సులతో పదవులు వస్తాయి కానీ చిన్నా రెడ్డిని విమర్శిస్తే రావు**

**-కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు.రాజేంద్రప్రసాద్**




**వనపర్తి,ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

వలసవాదుల వల్ల టిక్కెట్ కోల్పోయిన కాంగ్రెస్ సుదీర్ఘ ప్రయాణంలో గెలుపుకు ప్రయత్నించింది చిన్నారెడ్డే, అధికారంలోకి ఏ పార్టీ వచ్చిన నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాం కోసం నీళ్లు తాగి పార్టీకి పని చేశామని,వలసవాదులతో పార్టీని నడిపితే భవిష్యత్తులో మనుగడ ఉండదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు.రాజేంద్రప్రసాద్ యాదవ్ అభిప్రాయ పడ్డారు.మంగళవారం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నా రెడ్డి నివాసగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ఏ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించిన పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి బలం చేకూర్చామని అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో చిన్నారెడ్డి జోడోయాత్ర, వరంగల్ డిక్లరేషన్,గ్రామ కమిటీలు,మండల కమిటీలు వేస్తూ నియోజకవర్గంలో ఒక్కొక్క ఇల్లు నాలుగైదు సార్లు తిరిగి పార్టీ క్యాడర్ ను పెంచారని,ఆ గ్రాఫ్ తోనే మెగా రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. మీడియా సమావేశంలో గోపాల్ పేట్ మాజీ ఎంపీపీ ప్రభావతి చిన్నారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.2006లో జరిగిన గోపాల్ పేట ఎన్నికల్లో మండల కేంద్రంలో 16 ఎంపీటీసీ స్థానాల్లో 8 కాంగ్రెస్, 8 టిడిపి పార్టీ గెలిచాయని..ఆ సమయంలో చిన్నారెడ్డి ప్రత్యేక చొరవతోనే గోపాల్పేట్ ఎంపీపీగా ప్రభావతి అయ్యారని గుర్తు చేశారు.సత్య శిలారెడ్డి సర్పంచ్ గా పోటీ చేసే సమయంలో ఆయనకు పోటీగా సుధాకర్ రెడ్డి పోటీ చేశారని,ఆ సమయంలో ఎలాగైనా సర్పంచ్ గా గెలవాలని సహకరించాలని సత్యశీలా రెడ్డి చిన్నారెడ్డి కొరగా,సుధాకర్ రెడ్డిని విత్ డ్రా చేయించడంతో సత్యశీలా రెడ్డి సర్పంచిగా గెలిచారని గుర్తు చేశారు.ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వెళ్లేవారికి చిన్నారెడ్డి గురించి విమర్శించే స్థాయి కాదని హెచ్చరించారు.వనపర్తి లో కొందరు నాయకులు ఎవరి మెప్పు కోసం విమర్శిస్తున్నారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు.చిన్నారెడ్డి ఒకే పార్టీ నమ్ముకొని బతుకుతున్నారని..మీ తీరుగా ఖజానా ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లే రకం కాదని హెచ్చరించారు.నోరు ఉందని ఏది పడితే అది మాట్లాడటం పద్ధతి కాదని.. స్థాయి దాటి మాట్లాడితే సహించమని హెచ్చరించారు.ఈ సమావేశంలో మాజి జడ్పీటిసి. రాజేశ్వర్ రెడ్డి, మాజి సర్పంచ్. శాంతన్న, మాజి మున్సిపల్ వైస్ ఛైర్మెన్.కృష్ణ,సేవదల్ మహిళా విభాగం నాయకురాలు చిట్టెమ్మ, లీలావతి, జయమ్మ, కదిరే రాములు, కోట్ల రవి, జనార్దన్, ఎండి. బాబా, సమద్ తదితరులు పాల్గొన్నారు.

# రామేశ్వరంలో మద్యం మాంసం గుట్కా విక్రయాలకు “హైకోర్టు చెక్”

**-పవిత్ర స్థలంలో వీటిని విక్రయించరాదు అంటూ హైకోర్టు ఆదేశాలు**
**-పోలీసు, ఎక్సైజ్ శాఖలకు ఉత్తర్వులు జారీ**
**-శివరాత్రి పర్వదినాన భక్తులకు శుభవార్త**



**షాద్ నగర్,ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పవిత్రమైన రామేశ్వరం దేవాలయ పరిసరాలలో భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే విధంగా మద్యం మాంసం గుట్కా విక్రయాలు తదితర అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్న వారిపట్ల హైకోర్టు కొరడా జలిపించింది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం రామేశ్వరం దేవాలయం జాతర సందర్భంగా శివరాత్రి తదితర వేడుకలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో కొంతమంది అసాంఘిక కార్యకలాపాలతో మద్యం మాంసం గుట్కా తదితర నిషేధిత పదార్థాలను విక్రయిస్తున్నారని రాయికల్ గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. రెడ్ పిటిషన్ నెంబర్ 5461/2025 ద్వారా హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయమూర్తి నాగేష్ భీమపాక మంగళవారం ఉత్తర్వులను విడుదల చేశారు. సంబంధిత ఎక్సైజ్ పోలీసు శాఖలు వెంటనే చర్యలు తీసుకోవాలని రామేశ్వరం దేవాలయ పరిధిలోని దేవదాయ శాఖకు సంబంధించిన ఎండోమెంట్ స్థలాలు సర్వేనెంబర్లు 33, 36, 37, 38లలో 75 ఎకరాలలో స్థలం విస్తరించి ఉందని ఇక్కడ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చేపట్టకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా ఆర్ సత్తయ్య, ఆశన్న గౌడ్, అంతయ్య, సేవ్య, శంకర్ నాయక్, రాములు తదితరులకు కూడా ఇందులో వీరికి సంబంధించి కూడా ఉత్తర్వులలో ఆదేశాలు ఇస్తూ పేర్కొన్నారు. మహాశివరాత్రి కి ముందు రోజు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో పిటిషనర్ రాయికల్ మోహన్ రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చేపట్టకుండా హైకోర్టు ఉత్తర్వులను అందరూ పాటించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు..

## మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేసిన కెవియన్ రెడ్డి



**వంగూర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూర్ మండల కేంద్రంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవియన్ రెడ్డి రాష్ట్రంలోని రైతులకు, రైతు కూలీలకు, రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కవియన్ రెడ్డి మాట్లాడుతూ, “ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను. హిందువులు జరుపుకునే పండుగలలో మహాశివరాత్రి పండుగ ఒక అతిపెద్ద పండుగ. ఆ రోజున ఉదయాన్నే లేచి తలస్నానం చేసి, శంకరునికి పాలు, పెరుగు, నెయ్యి, తేనే తో అభిషేకం చేస్తారు. శివలింగ రూపంలో దర్శనమిస్తాడని భక్తులు నమ్ముతారు. పార్వతీ పరమేశుల కళ్యాణం మహాశివరాత్రి రోజునే జరిగింది. ఆ రోజంతా ఉపవాసం ఉండి, రాత్రి నిద్రపోకుండా శివనామ స్మరణ చేస్తూ జాగారం చేస్తే త్రిలోకాదిపతి అనుగ్రహం లభిస్తుందని భక్తుల నమ్మకం” అని వివరించారు. పరమశివుని భక్తిశ్రద్ధలతో పూజించాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారని కెవియన్ రెడ్డి తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష



**కల్వకుర్తి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మద్యం సేవించి వాహనం నడిపితే తప్పకుండా శిక్ష అనుభవించాల్సిందేనని కల్వకుర్తి పోలీసులు స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో కోర్టు ఇద్దరికీ జైలు శిక్ష విధించిందని కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి వెల్లడించారు.
పోలీసులు ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డ ఇద్దరికీ న్యాయస్థానం కఠిన శిక్షలు విధించింది.

**1. కాటమోని శంకర్ (36)** **వృత్తి:** టైలర్, మక్తపల్లి గ్రామం, జడ్చర్ల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా.
శిక్ష: 48 గంటలు (రెండు రోజులు) జైలు, రూ. 100 జరిమానా.

**2. దాగమోని కేశవులు (35)** **వృత్తి:** వ్యవసాయం, ఎస్సీ మాల గ్రామం, తెలకపల్లి మండలం, నాగర్ కర్నూల్ జిల్లా.
శిక్ష: 24 గంటలు (ఒక రోజు) జైలు, రూ. 100 జరిమానా.

డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలకు దారితీసే ప్రమాదకరమైన చర్య అని పోలీసులు హెచ్చరించారు. రహదారులపై ప్రయాణికుల భద్రతకు మద్యం సేవించి వాహనం నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, చట్టాలను గౌరవించాలని సూచించారు.

## మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన జూపల్లి భాస్కరరావు



**చార కొండ, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చారకొండ మండల పరిధిలోని జూపల్లి గ్రామంలో మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని వెల్దండ మండల ప్రజలకు వెల్దండ సింగిల్ విండో ఛైర్మన్ జూపల్లి భాస్కరరావు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, శివరాత్రి సందర్భంగా ప్రజలు శివునికి పాలు, పెరుగు, నెయ్యి, తేనేతో అభిషేకం చేయాలని, శివనామ స్మరణ చేస్తూ జాగారం చేయాలనే సూచనలు ఇచ్చారు. శివుని అనుగ్రహం లభిస్తుందని భక్తుల నమ్మకమని పేర్కొన్నారు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహేశ్వరం నియోజకవర్గంలోని జలపల్లి మున్సిపాలిటీలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ అర్హులైన 63 మంది లబ్ధిదారులకు చెక్కులను మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రివర్యులు శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం 14 నెలలు గడిచినా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని, ఏ హామీ కూడా నెరవేర్చలేదని, అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తాను ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ, ఇకనైనా మార్పు తెచ్చుకొని ఎన్నికల కంటే ముందు ఇచ్చిన ప్రతి హామీని కూడా నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల తాసిల్దార్, జలపల్లి మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్, మాజీ వైస్ ఛైర్మన్, మాజీ కౌన్సిలర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**కల్వకుర్తి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా పాఠశాలలో చదివే విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి, చక్కగా బోధన చేస్తూ ఆదర్శంగా నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్య గౌడ్ మాట్లాడుతూ, స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులను ఉపాధ్యాయులుగా ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నతమైన లక్ష్యాలకు చేరుకుంటారని, ఉపాధ్యాయ వృత్తిలోని కష్టసుఖాలను విద్యార్థులు తెలుసుకుంటారని, ప్రతి సంవత్సరం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని, స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బి. వెంకటయ్య, గ్రామ కార్యదర్శి గుత్తి కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



**భువనగిరి, ఫిబ్రవరి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భువనగిరి పట్టణంలోని విద్యానగర్లో విషాదం చోటుచేసుకుంది. మహిళా ఏఆర్ కానిస్టేబుల్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది .సిద్దిపేట జిల్లా కోయడకు చెందిన కే అనూష 2020లో ఏఆర్ కానిస్టేబుల్కు ఎంపికై యాదాద్రి జిల్లాలోని హెడ్క్వార్టర్లో విధులు నిర్వహిస్తుంది. కుటుంబ సభ్యులు ఇష్టంలేని పెళ్లి నిర్ణయించారని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది..

## తాడూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ఆరోగ్య సిబ్బందికి వేధింపులు



**తాడూర్, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని తాడూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సిబ్బందికి వేధింపులు జరుగుతున్నాయని ఆరోపణలు వచ్చాయి. ఆంజనేయులు అనే వ్యక్తి తరచూ మద్యంమత్తులో వచ్చి పిహెచ్‌సి సిబ్బందిని వేధిస్తూ, వారి విధులకు ఆటంకం కలిగిస్తున్నాడు. అతని వల్ల ప్రాణహాని ఉందని మహిళా ఉద్యోగులు షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మల్లప్ప గుట్ట శివరాత్రి మహోత్సవంలో పాల్గొననున్న అసెంబ్లీ స్పీకర్

**తలకొండపల్లి, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామంలో శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, 11:30 నిమిషాలకు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మల్లప్ప గుట్ట శివరాత్రి మహోత్సవంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

## మోడల్ స్కూల్ దరఖాస్తు గడువు పొడిగింపు



**వెల్దండ, ఫిబ్రవరి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలోని మోడల్ స్కూల్ దరఖాస్తు గడువును మార్చి 10 వరకు పెంచినట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ నెల 28తో గడువు ముగియనుండగా, మార్చి 10 వరకు పొడగిస్తున్నట్లు ప్రభుత్వం జీవో జారీ చేసింది. మోడల్ స్కూల్లో ఆరు నుండి పది తరగతుల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తు ఫీజు ఓసీలకు 200 రూపాయలు, ఇతర వర్గాల వారికి 125 రూపాయలు.